క్లుప్తంగా

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన


సేంద్రియ వ్యవసాయం గురించి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: సహజసిద్ధ పద్ధతులను అవలంభించి సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను గురించి నరసాపురం మండలం రాజుల్లంక గ్రామ రైతులకు శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన పి భార్గవ సంజయ్‌వర్మ, సందీప్‌లు సెంచూరియన్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్ విద్యను అభ్యసిస్తున్నారు. అయితే వీరు ఇటీవల గ్రామానికి వచ్చి గ్రామ సర్పంచ్, మాజీ సర్పంచ్ వేగేశ్న రామరాజు, ముదునూరి మాత్రాజుల సహకారంతో గ్రామంలోని రైతులతో సమావేశం నిర్వహించి పాడి పంటలపై రసాయనాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గురించి వివరించారు.

శేరేపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్


శేరేపాలెంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ లీనా

మొగల్తూరు: మండలంలోని శేరేపాలెం గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోగులను డాక్టర్ లీనా పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

కిటకిటలాడిన మేరీ మాత ఆలయం


కేపీ పాలెంలో సముద్ర స్నానం చేస్తున్న విశ్వాసులు

మొగల్తూరు: కేపీ పాలెం సాగర తీరంలో ఉన్న వేళాంకిణ్ణీ మాత (మేరీ మాత) ఆలయం విశ్వాసులతో కిటకిటలాడింది. ప్రతీ ఏటా గుడ్ ఫ్రైడేకు ముందు నలభై రోజులు ముందు నుండి దీక్ష చేపడతారు. గుడ్ ఫ్రైడే రోజున మేరీ మాతను దర్శించుకుని మెరుసటి రోజు సముద్రస్నానం అనంతరం మాల విరమణ చేసి తమ మొక్కులు తీర్చుకుంటారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి ప్రతీ వేలాది మంది విశ్వాసులు తరలిరావడంతో శనివారం కేపీ పాలెం బీచ్ కిటకిటలాడింది. డీఎస్పీ మనోహరాచారి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ సురేష్ బాబు పర్యవేక్షణలో ఎస్సై ఎం.వీరబాబు పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ముస్తాబవుతున్న సమాధులు


కొడమంచిలిలో పెద్దల సమాదులను శుభ్ర పరుస్తున్న క్రైస్తవులు

పెనుగొండ: ఈస్టర్ పండుగ జరుపుకోవడానికి క్రైస్తవ సోదరులు సిద్ధమవుతున్నారు. కుటుంబంలో మరణించిన వారి సమాధులను శనివారం ఉదయం నుంచి శుభ్రపరిచి తీర్చిదిద్దుతున్నారు. రంగులద్దడంతో పాటు, పువ్వులతో అలంకించారు. ఆదివారం తెల్లవారు జామున సమాధుల వద్ద ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించనున్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్'

నరసాపురం: నియోజకవర్గంలో 'జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. నరసాపురం పట్టణంలో 6వ వార్డు నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం శనివారం 8,9,10,11,12,16,17 వార్డుల్లో సాగింది. ఆయా వార్డుల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కూడా పాల్గొన్నారు. కొన్ని వార్డుల్లో ఇళ్లకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతీ కుటుంబానికి జరిగిన మంచిని వివరించారు. ఇంటి యజమానుల అంగీకారంతో జగనన్న స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని వలంటీర్లు, గృహసారథులు, సచివాలయకన్వీనర్లు 14 రోజులపాటు ప్రతీ ఇంటికీ తిరుగుతారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణచ మండల, యూత్ అధ్యక్షులు బూసరపు జయ, దొంగ మురళీకృష్ణ, చదలవాడ మెర్లిన్, గోరు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో...

మొగల్తూరు: జగన్ననే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ చేపట్టిన కార్యక్రమానికి గ్రామాల్లో అనూహ్య స్పందన లభిస్తుంది. శనివారం కొత్తపాలెంలో ఏర్పాటు చేసిన గృహ సారథుల సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు తిరుమాని బాపూజీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహనరెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్న విషయాన్ని ప్రతీ ఇంటికి వెళ్ళి వివరించాలని సూచించారు.

పెనుగొండలో..

పెనుగొండ: జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి రెండవరోజూ అనూహ్య స్పందన లభించింది. శనివారం ఉదయం నుంచి పెనుగొండ మండలంలో పెనుగొండ, వడలి, ఇలపర్రు, మునమర్రు, కొఠాలపర్రు, దేవ, ములపర్రు, నడిపూడి, దొంగరావిపాలెంల్లో నిర్వహించారు. స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు గడపగడపకూ తిరిగి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడంతో పాటు, వారికి అందిన సంక్షేమ పథకాలు లబ్ధిపై ఆరాతీసి వారికి స్టిక్కర్లు అందించారు. ఎక్కడికక్కడ లబ్ధిదారులే వారి గుమ్మాలకు స్టిక్కర్లు అంటించుకొని మా నమ్మకం నువ్వే జగన్ అంటూ మద్దతు పలికారు.


నరసాపురంలో ఓ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

లంకగ్రామాల్లోనూ

ఆచంట మండలం లంక గ్రామాల్లోనూ జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ నిర్వహించారు. అయోధ్యలంక ఆదివారం ఉదయం నుంచి గడపగడపకూ వెళ్లి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. ఆచంట, వల్లూరు, కోడేరు, భీమలాపురం, పెనుమంచిలి, ఆచంట వేమవరం, కొడమంచిలి, కందరవల్లి, కరుగోరుమిల్లిల్లోనూ జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్‌ను నిర్వహించారు. ప్రతీ గ్రామంలో విశేష స్పందన లభిస్తుండడంతో కార్యకర్తలు, నాయకుల్లోనూ నూతనోత్సాహం నెలకొంది.

పోడూరులో..

పోడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. పెనుమదం గ్రామంలో శనివారం 'జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఇంటింటికీ పర్యటించి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొ్రపాటి వీరాస్వామి, గ్రామకమిటీ అధ్యక్షుడు గెద్దాడ ఏసు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డీటీడీసీ బాబు, ఉపసర్పంచ్ పితాని చిన్న, పడమటి నాగబాబు, బొడ్డు బాబి, పాటంశెట్టి నాగరాజు, అల్లు మురళి, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని జగన్నాథపురం, తూర్పుపాలెం, పండితవిల్లూరు గ్రామాల్లో శనివారం జగనన్నే మా భవిష్యత్-నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు గుడాల శిరీష చంటి, గుబ్బల ఉషారాణి, ఇళ్ల లక్ష్మీ చంద్రిక, ఏఎంసీ వైస్‌చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం, సొసైటీ చైర్మన్ గెద్దాడ ఏకలవ్య, ఇర్రింకి శ్రీనివాస్, ఇళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పెనుమదంలో జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

యలమంచిలిలో..

యలమంచిలి: జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మండలంలోని 32 గ్రామాలలో జోరుగా సాగుతుంది. ప్రతి గ్రామంలోను వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి నవరత్నాల పథకాల్లో కనీసం రెండు మూడు పథకాలు వర్తించడంతో అందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుంచి ప్రభుత్వానికి అనుకూలంగా అనూహ్య స్పందన రావడంతో పార్టీ నాయకులు జోరుగా ఇంటింటికీ తిరుగుతున్నారు. ప్రజల నుంచి ఆదరణ బాగుండడంతో కార్యకర్తలు నూతన ఉత్సాహం కనబరుస్తున్నారు.

1.35 లక్షల కుటుంబాలకు సంక్షేమం

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో 1.35 లక్షల కుటుంబాలకు నేరుగా సంక్షేమ ఫలాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండలంలోని అరట్లకట్ట, వాలమర్రు, పూలపల్లి గ్రామాల్లో శనివారం జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో నేరుగా లబ్ధిదారులను కలిసి నవరత్నాల పథకాల ద్వారా ప్రజలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. వాలమర్రులో సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, అరట్లకట్ట ఎంపీటీసీ చింతలపల్లి సాయిబాబా, వాలమర్రు సొసైటీ అధ్యక్షుడు వేండ్ర సింహాచలం, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స సుభాష్ చంద్ర త్రినాథరాజు (బోసురాజు), ఉపసర్పంచ్ దాసరి శ్రీనివాస్, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, పట్టణ , మండల సచివాలయాల కన్వీనర్లు పార్శి వెంకటరత్నం, ఎంఎస్ వాసు పాల్గొన్నారు.


పూలపల్లిలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్


వడలిలో జగనన్నే మా భవిష్యత్ -మా నమ్మకం నువ్వే జగన్ నిర్వహిస్తున్న ఎంపీటీసీలు, గృహసారథులు


ఆచంటలో జగనన్నే మా భవిష్యత్ - మా నమ్మకం నువ్వే జగన్ నిర్వహిస్తున్న నాయకులు


కొత్తపాలెంలో గృహ సారథుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాపూజీ


ఏనుగువానిలంకలో సర్వే చేస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు

చలివేంద్రం నిర్వహణ అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీతారాం

పెనుగొండ: కొడమంచిలి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా చలివేంద్రాన్ని నిర్వహించడం అభినందనీయమని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం అన్నారు. శనివారం పంచాయతీ వద్ద రామాలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు బాలనాగు నరేష్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బాలనాగు శ్రీనివాస్, సంఘ నాయకులు కొల్లేపర వెంకన్న బాబు, కొల్లేపర సాయిబాబా, కాజా రాజా, కాజా సర్వేశ్వరరావు, బాలనాగు అప్పారావులు పాల్గొన్నారు.

వడలిలో మౌలిక సదుపాయాల కల్పన

పెనుగొండ: వడలి జగనన్న కాలనీల్లో సమస్యలు తొలగించి, మౌలిక సదుపాయాల కల్పనకు చకచకా ఏర్పాట్లు ప్రారంభించారు. ఇటీవల గడపగడపకూ మన ప్రభుత్వంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి కాలనీల్లోని సమస్యలను తీసుకు రావడంతో సత్వరం పరిష్కరించాలంటూ పంచాయతీకి సూచించారు. దీంతో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. వడలిలో చాకిరేవు పుంతలో 87 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. వీటిలో ఇప్పటికే కొందరు ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. దీంతో పాటు ఎస్సీ కాలనీ వద్ద 123 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు అందించారు. వీటికి విద్యుత్ సదుపాయం, నీటి పైపులైను నిర్మాణాలు చేసారు. అయితే, ఇటీవల కాలంలో మరమ్మతులు రావడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో నిర్మాణాలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ తరుణంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులు మాజీమంత్రి శ్రీరంగనాథరాజుకు విన్నవించుకొన్నారు. దీంతో రెండు రోజులుగా పనులు ప్రారంభించారు. కొన్ని ఇంటి స్థలాలు మీదుగా విద్యుత్ వైర్లు సైతం వెళ్లడంతో వాటిని తప్పించి వేయడానికి ఏర్పాట్లు చేయడం ప్రారంభించారు. దీంతో పాటు తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు చేసి పునఃరుద్ధరిస్తున్నారు. అదేవిధంగా తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగి పోవడంతో వాటి నివారణకు కలుపు నివారణ మందు పిచికారి చేశారు. సమస్యలు విన్నవించకోగానే సత్వరం స్పందించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.



వడలి జగనన్న కాలనీలో ఇళ్లపై వెళుతున్న విద్యుత్ వైర్లు తప్పిస్తున్న పంచాయతీ సిబ్బంది , వడలి జగనన్న కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ సిబ్బంది →

వెలివెలలో స్వామివార్ల కల్యాణోత్సవాలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని వెలివెల గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఉమా సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీ రాధాకృష్ణస్వామి వార్ల కల్యాణోత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన బోడపాటి విజయ్‌కుమార్ - లక్ష్మీ నాగమణి దంపతులతో అర్చక స్వామి పుల్లేటికుర్తి సత్య వెంకట నాగభూషణం బ్రహ్మత్వంలో స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమార్చన చేశారు. ముందుగా గ్రామంలో స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బోడపాటి వెంకటనారాయణ-వెంకటలక్ష్మీ పార్వతి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ పనుల పరిశీలన

సాక్షి, భీమవరం: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను శనివారం శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు పరిశీలించారు. ఈసందర్భంగా విగ్రహం వద్ద చేపట్టాల్సిన పనులకు సంబంధించి కొన్ని సూచనలు చేశారు. విగ్రహావిష్కరణ త్వరలో చేయనున్నందున పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ దాసి రాజు, తహసీల్దార్ పాల్గొన్నారు.

బైబిల్ బోధనలు శాంతిని సూచిస్తాయి

నరసాపురం: బైబిల్ బోధనలు సమాజంలో శాంతిని సూచిస్తాయని నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అన్నారు. టి.సంజయ్ కిషన్ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా నిర్వహించే రస్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం చైర్‌పర్సన్ స్థానిక థామస్‌బ్రిడ్జి వద్ద జండా ఊపిప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరసాపురం ప్రాంతంలో క్రైస్తవ మిషనరీల సేవలు అమోఘమన్నారు. ఈ ప్రాంతంలో క్రైస్తవులు సేవా కార్యక్రమాల ద్వారా అందరిలో సోదరులవలే కలిసిపోయారని చెప్పారు. సంజయ్ కిషన్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అన్ని క్రైస్తవ సంఘాలు, క్రైస్తవ ప్రముఖులు, పాస్టర్లను కలుపుకుని రస్‌ఫర్ జీసస్ పేరుతో గత 12 ఏళ్లగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈస్టర్ పండుగ ముందురోజు ఈ కార్యక్రమం జరుపుతామని చెప్పారు. క్రైస్తవాన్ని ఆచరించడమంటే మెరుగైన జీవన విధానంలోకి రావడమేనన్నారు. థామస్‌బ్రిడ్జి నుంచి అంబేడ్కర్ సెంటర్, స్టీర్‌రోడ్డు మీదుగా 10కెరస్ సాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, కౌన్సిలర్ అడిదల శరత్, కమిటి ప్రతినిధులు సికిలే పెర్సిపాల్, చదలవాడ జ్ఞానప్రకాష్, ఏడీవీ ప్రసాద్, దాసరి దేవరాజు, కేఎస్ ప్రకాష్, శాంసన్‌రాజు పాల్గొన్నారు.


రస్‌ఫర్ జీసస్ కార్యక్రమం ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

చర్చి నిర్మాణం నిలిపివేయడంపై ఆగ్రహం

ఉండి: మండలంలోని చెరుకువాడలో శుక్రవారం రాత్రి పంచాయితీ, రెవెన్యూ అధికారులు పోలీసుల సహాయంతో నిర్మాణంలో ఉన్న చర్చిని కూలదోయడంపై స్థానిక క్రైస్తవులు, క్రైస్తవ నాయకులు శనివారం ఆగ్రహం తెలిపారు. ఉండి సెంటర్‌లో సుమారు అరగంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయంటూ అధికారులు ప్రొక్లెయినర్ సహాయంతో చర్చి నిర్మాణ పనులను కూలగొట్టడం దారుణమని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐఎఫ్ఎఫ్‌సీఐ(ఫ్రీడం ఫర్ క్రిష్టియన్ ఇంటిగ్రిటీ) జాతీయ అధ్యక్షుడు పీటర్ పుట్టా, రాష్ట్రాధ్యక్షుడు ఎండీ ఇష్మాయిల్, మత్తి రాజ్‌కుమార్, పాస్టర్ కన్నిడి హేమ్ కుమార్,థామస్ స్టాన్లీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వారిపై కేసు నమోదు

ఉండి: ఉండి సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.చెరుకువాడ గ్రామంలో నూతిగట్టుకు చెందిన పాస్టర్ కన్నిడి హేమ్‌కుమార్ అనధికారికంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు చేపట్టిన చర్యలను వ్యతిరేకిస్తూ శనివారం ఉండి సెంటర్‌లలో రాస్తారోకో నిర్వహించారు. దీంతో ప్రజాశాంతికి అంతరాయం కలిగించడంతో పాటు ట్రాఫిక్ అవరోధంగా రహదారిపై అడ్డంగా కూర్చున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి ఎస్సై కే గంగాధరరావు దర్యాప్తు చేస్తున్నట్లు నట్లు పోలీసులు తెలిపారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి విశాఖపట్నానికి చెందిన ఉప్పల కార్తీక్, ప్రత్యూష దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. శనివారం ఆలయం వద్ద అమ్మవారిని దర్శించుకుని అక్కడి సిబ్బందికి బంగారాన్ని అందించారు. వారికి ఆలయ సిబ్బంది ప్రసాదం, రసీదును అందజేశారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

ఆకివీడు: మండలంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను, ఏపీఓఎస్ఎస్ కేంద్రాలను శనివారం సర్వ శిక్ష అభియన్ అడిషనల్ కోఆర్డినేటర్ పి.శ్యామ్ సుందర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించి, డిపార్టుమెంటల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లకు పలు సూచనలు ఇచ్చారు. పరీక్షా కేంద్రాల్లో అవకతవకలకు తావులేకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాళ్ల: డ్యూటీ ముగించుకుని ఇంటికి సైకిల్ పై వెళ్తున్న వ్యక్తి ని మోటార్ సైకిలిస్ట్ ను ఢీ కొన్న ఘటనపై కాళ్ల పోలీసు స్టేషన్లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాళ్ల మండలం బొండాడపేటకు చెందిన కోటిపల్లి పాండు రంగారావు సీసలి గ్రామంలోని ఒక ప్రైవేటు ఫ్యాక్టరీ లో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి పని ముగించుకుని సైకిల్ పై వెళ్తుండగా సాయిబాబా గుడి ప్రాంతంలో అతి వేగంగా వెళ్తున్న మోటర్ బైక్ ఢీకొట్టింది. గాయపడిన పాండు రంగారావును భీమవరం పట్టణంలో ని ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి వచ్చిన స్టేట్మెంట్ మేరకు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్ దురుసు ప్రవర్తన

ఆకివీడు: ఆటో బస్సు ఢీకొన్న సంఘటనపై ఆటో డ్రైవర్లు బస్సు డ్రైవర్ నాయక్, కండక్టర్ కుమార్, కొంత మంది ప్రయాణికులపై దాడి చేసిన సంఘటన శనివారం ఆకివీడులో చోటు చేసుకుంది. భీమవరం నుండి ఏలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, తాడినాడకు చెందిన ఆటో భీమవరం వైపు వెళుతుండగా భీమవరం రైల్వే గేట్ సమీపంలో ఢీకొన్నాయి. సంఘటనపై ఆర్టీసీ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి అక్కడ నుండి బస్సు ఏలూరు బయలుదేరింది. ఆకివీడు బస్టాండ్‌కు వచ్చేసరికి కొంతమంది ఆటో డ్రైవర్లు బస్సును వెంబడించి ఆకివీడులో నిలుపుదల చేసి దాడికి పాల్పడినట్లు నాయక్, కుమార్, కొంతమంది ప్రయాణికులు ఆకివీడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు విలేకరులకు చెప్పారు. సంఘటనపై పోలీసులు ప్రస్తుతం కేసు నమోదు చేయలేదు.